సాక్షి
పెద్దపల్లి

శనివారం : 3 : ఫిబ్రవరి : 2024



నిబంధనలు పాటించాలి

కమాన్‌పూర్: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై వాహనదారులకు ఎంవీఐ మధు అవగాహన కల్పించారు.



పత్తి ధర రూ.6,600

జమ్మికుంట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.6,600, మోడల్‌గా రూ.6,500, కనిష్టంగా రూ.6,000 ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.8/21.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

6న బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికలకు నేతలను సమాయత్తం చేయడానికి రామగుండం నియోజకవర్గస్థాయి సమావేశం ఈనెల 6న నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీలోని లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు. తన అయిదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చానని ఆయన తెలిపారు. తన హయాంలో అభివృద్ధేమీ జరగలేదనే ఆరోపణలు చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు మూల విజయారెడ్డి, పెంట రాజేశ్, కుమ్మరి శ్రీనివాస్, గోపు ఐలయ్యయాదవ్, మెతుకు దేవరాజ్, అచ్చవేణు, మారుతి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జాహెద్ పాషా, చల్లగురుగుల మొగిలి, చల్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వారీల్లో పనులు నిలిపివేత



పనులు నిలిపివేస్తున్న అధికారులు

పాలకుర్తి(రామగుండం): జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధి కన్నాల బోడగుట్టపై అనుమతులు లేకుండా బండరాయి వెలికితీస్తున్న క్వారీల్లో మైనింగ్ అధికారులు శుక్రవారం పనులు నిలిపివేశారు. అనుమతులు లేకుండా బండరాయిని వెలికితీస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిశారు. ఈ నేపథ్యంలో జిల్లా మైనింగ్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ రేణుక ఆధ్వర్యంలో క్వారీలు తనిఖీ చేశారు. అనుమతులు లేనివాటిలో పనులు నిలిపివేశారు. కంప్రెషర్, ట్రాక్టర్లను బయటకు పంపించివేశారు. బోడగుట్టపై సంపంగి లక్ష్మణ్, సూర రాజుకుమార్ క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని రేణుక తెలిపారు.

రైల్వేస్టేషన్ మేనేజర్‌కు సమ్మె నోటీసు



నోటీసు అందిస్తున్న ప్రతినిధులు

రామగుండం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే అఖిల భారత సమ్మెలో రామగుండం రైల్వే కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ అనుబంధ తెలంగాణ రైల్వే కాంట్రాక్టు క్యాజువల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈమేరకు స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ప్రతినిధులు బొంకూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశయ ఫౌండేషన్ కార్యవర్గం



సదాశయ కొత్త కార్యవర్గం

కోల్‌సిటీ(రామగుండం): సదాశయ ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేయడం కోసం ఫౌండేషన్ జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గోదావరిఖని పట్టణ సదాశయ ఫౌండేషన్ కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం కోసం శుక్రవారం స్థానిక శారదానగర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా బొల్ల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షురాలుగా సూర్యదేవర జ్యోతి, సంయుక్త కార్యదర్శిగా టి.రాములు, ఉపాధ్యక్షురాలుగా శారద, కార్యనిర్వాహక సభ్యులుగా శశికళ, సత్యం, లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, రాష్ట్ర ప్రతినిధి కేఎస్‌వాసుతోపాటు నారాయణ సుందర్, దూడెం వాణి పాల్గొన్నారు.

పాలకులకు పదవీగండం

- బల్దియా చైర్‌పర్సన్లను భయపెడుతున్న 'అవిశ్వాసం'
- నేడు సుల్తానాబాద్, 16న మంథనిలో బలపరీక్షలు
- రామగుండం మేయర్ పదవికి పొంచిఉన్న ముప్పు
- ఆసక్తి రేపుతున్న జిల్లా రాజకీయాలు



సుల్తానాబాద్ : బల నిరూపణ పరీక్షకు సిద్ధంగా ఉన్న సుల్తానాబాద్ మున్సిపల్ సమావేశ మందిరం

సాక్షి, పెద్దపల్లి/మంథని/సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. జిల్లాలోని స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల జోరు పెరుగుతోంది. జిల్లాలోని నాలుగు బల్దియాల్లో కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు సంఖ్యాపరంగా బీఆర్‌ఎస్‌కు చెందిన వారే అత్యధిక స్థానాల్లో గెలుపొందారు. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించగా, పాలకుల పదవీకాలం జనవరి 2025 వరకు ఉంది. అయితే, బీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయిలో బలం ఉన్నా.. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తీరు నచ్చక, లేదా పదవీచ్యుతులనుచేయాలనే పట్టుదులతో అవిశ్వాస తీర్మాన నోటీసులు జారీచేస్తున్నారు. మరో ఏడాది వరకే గడువు ఉండడంతో పలువురు ప్రజాప్రతినిధులు తమ పంతం నెగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఒకచోట అవిశ్వాసం పూర్తిచేయగా, సుల్తానాబాద్‌లో శనివారం అవిశ్వాస తీర్మానం బలపరీక్ష నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మంథనిలో ఈనెల16 బలపరీక్ష నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మరోపక్క జెడ్పీ చైర్మన్ పుట్ట మధును తొలగించేందుకు, రామగుండం కార్పొరేషన్ మేయర్, పెద్దపల్లి చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశ పెట్టేందుకు అంతర్గత యత్నాలు చేస్తున్నారు. దీంతో జిల్లా రాజకీయం వేడెక్కుతోంది. లోక్‌సభ ఎన్నికల్లోపు ఈప్రక్రియ పూర్తిచేసి చైర్మన్లకు షాక్ ఇచ్చేందుకు సభ్యులు ఏకమవుతున్నారు.

అప్పన్నపేటలో నెగ్గిన అవిశ్వాసం

- అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దాసరి చంద్రారెడ్డి (మాజీ ఎమ్మెల్యే బంధువు)పై సోమవారం ప్రవేశ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నాటకీయ పరిణామాల తర్వాత చైర్మన్‌గా ఎన్నికైన సంపత్ కాంగ్రెస్ గూటికి చేరారు.

నేడు సుల్తానాబాద్‌లో..

- సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యాల సునీత(బీఆర్‌ఎస్)పై సొంత పార్టీతోపాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇప్పటికే కలెక్టర్‌కు అవిశ్వాసంపై లేఖ అందించారు. అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జోక్యంతో ఆ ప్రక్రియ అప్పుడు వెనక్కి తగ్గింది. బల్దియాలో 15 వార్డులు ఉండగా బీఆర్‌ఎస్ నుంచి 9 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు గెలుపొందారు. ఇందులో ఒకరు మృతిచెందగా కాంగ్రెస్ నుంచి ఐదుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో అసంతృప్త కౌన్సిలర్లు తాజాగా మరోసారి అదనపు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. దీంతో శనివారం బలపరీక్ష నిర్వహించనున్నారు. అవిశ్వాసం ప్రవేశ పెట్టిన పెట్టిన కౌన్సిలర్లు ఇప్పటికే హైదరాబాద్ క్యాంపులో ఉన్నారు.

16న మంథనిలో..

- మంథని మున్సిపాలిటీలో 13 స్థానాలు ఉండగా, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్ నుంచి 11మంది గెలిచారు. దీంతో పుట్ట శైలజ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఏడుగురు తాజాగా మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరి ఏకంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు అదనపు కలెక్టర్‌కు లేఖ అందించారు. దీంతో ఈనెల 16న బలపరీక్ష నిర్వహించనున్నారు.

రామగుండంలో..

- రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి 18 మంది, కాంగ్రెస్ నుంచి 11 మంది, బీజేపీ నుంచి ఆరుగురు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి తొమ్మిది మంది, స్వతంత్రులు ఆరుగురు విజయం సాధించారు. ఆ తర్వాత పరిణామాల్లో చేరికలతో బీఆర్‌ఎస్ సంఖ్యాబలం 40కి చేరింది. ఇందులో 23వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సావిత్రి మృతిచెందగా, ప్రస్తుతం ఆ పార్టీకి 39 మంది, కాంగ్రెస్ నుంచి 10మంది ఉన్నారు. అయితే, మేయర్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు 25మంది కార్పొరేటర్లు సంతకాలు సేకరించి క్యాంపు రాజకీయాలకు సన్నద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సమయంలో ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

పెద్దపల్లి మున్సిపాలిటీలో..

- పెద్దపల్లి మున్సిపల్‌లో 36 వార్డులు ఉన్నాయి. 24సీట్లు బీఆర్‌ఎస్, 5 స్థానాలు కాంగ్రెస్, 2 స్థానాలు బీజేపీ, మరో రెండు ఎంఐఎం, ఒకటి ఏఐఎఫ్‌బీ, ఇద్దరు స్వతంత్రులు దక్కించుకున్నారు. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్, బీఎస్పీలో చేరగా ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 19మంది సభ్యుల బలం ఉంది. అయితే, చైర్మన్ పదవి ఆశిస్తున్న పలువురు ఆయనపై అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు అంతర్గతంగా సంతకాలు సేకరిస్తున్నారు. మొత్తంగా జిల్లాలో అవిశ్వాసాల హడవుడి కొనసాగుతోంది.

పుట్ట మధును వెంటాడుతున్న అవిశ్వాసం ముప్పు!

జిల్లాలో 13 మంది జెడ్పీటీసులు ఉండగా బీఆర్‌ఎస్ నుంచి 11మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి బీజేపీ, పెద్దపల్లి జెడ్పీటీసీ బండారి రాంమూర్తి బీఎస్పీలో చేరారు. అదేవిధంగా ఓదెల జెడ్పీటీసీ గంట రాములు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్‌లో ప్రస్తుతం 10మంది, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలో ఒక్కొక్కరు ఉన్నారు. అయితే, మంత్రి శ్రీధర్‌బాబు అండతో పుట్ట మధుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు బీఆర్‌ఎస్ సభ్యులు సంతకాలు సేకరించారు. అవిశ్వాసం నెగ్గేందుకు ఏడుగరు, సమావేశం నిర్వహించేందుకు 9మంది సభ్యుల సంఖ్యాబలం అవసరం. అయితే, అప్రమత్తమైన పుట్ట మధు తనతోపాటు నలుగురు సభ్యులను ప్రత్యర్థి శిబిరంలోకి జారిపోకుండా అడ్డుకోగలిగారు. చైర్మన్ వ్యతిరేక శిబిరంలో 8మంది సభ్యులే ఉండడంతో అవిశ్వాసంపై ముందుకు కదలలేదు. ఇక చైర్మన్‌తో పుస్కూరి పద్మజ, ఆముల నారాయణ, తగరం సుమలత, గంటా రాములు ఉన్నారు. వీరిలో ఒకరిని తమ వైపుకు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. పుట్ట మధును పదవి నుంచి దించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, పదవిని కాపాడుకునేందుకు పుట్ట మధు ఎత్తుకు పైఎత్తులు వేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

'సమ్మె చేస్తాం'



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి కోరారు. తొలుత పలు కంపెనీల అధికారులకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బిక్షపతి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, పురుషోత్తం, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, రవికాంత్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యంతో రామరాజ్యం



వర్ధంతి సభలో నాయకులు

గోదావరిఖనిటౌన్: గాంధీజీ ప్రవచించిన గ్రామ స్వరాజ్యం ద్వారా రామ రాజ్యం సిద్ధిస్తుందని రచయిత ఏలేశ్వరం వెంకటేశ్ అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా నేషనల్ యూత్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు కె.యాదవరాజు ఆధ్వర్యంలో జనవరి 30 నుంచి ఈనెల 5వ తేదీ వరకు యూత్ అవేర్‌నెస్ ప్రోగ్రాం చేపట్టారు. గ్రామ గామాన జాతిపిత కార్యక్రమంలో భాగంగా స్థానిక స్నేహ సాహితీ గ్రంథాలయంలో శుక్రవారం గాంధీజీ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం వెంకటేశ్ మాట్లాడారు. సత్యం, అహింస విధానాలతో ప్రజలు గాంధీ మార్గం అనుసరించారని, గాంధీ మార్గమే ఎప్పటికీ అందరికీ శ్రేయస్కరమన్నారు. ప్రస్తుతం గ్రామ స్వరాజ్యం పునరుద్ధరణ జరగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు దయానంద్‌గాంధీ, అందె సదానందం, ప్రకాశ్‌రెడ్డి, డి.నారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గతమంతా మోసమే


- అధికారంలోకి వస్తామని అనుకోలేక ఆగమాగం
- కార్యకర్తలను ముట్టుకుంటే ఆందోళనలు
- మంథనిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మాట్లాడుతున్న మధుసూదనాచారి

మంథని: సీఎంగా సేవలు అందించిన కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే దిక్సూచిగా నిలిపారని, కానీ, అనేక అసత్యాలు, ఆచరణ సాధ్యం కానిహామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రజల్ని మోసం చేసిందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి విమర్శించారు. శుక్రవారం స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరెంట్ కోతలు మొదలయ్యాయన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 20 శాతం పెంచుతామని అంటున్నారని, దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా అది సాధ్యం కాలేదని అన్నారు. ఇలాంటి సాధ్యం కానీ హామీలు ఇవ్వడంలో కాంగ్రెస్ దిట్ట అని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ అనుకోలేదని, అనూహ్యంగా అవకాశం రావడంతో నాయకులు ఆగమాగమవుతున్నారని ఎద్దేవా చేశారు. 50రోజుల్లోనే రేవంత్ పాలన తీరు ప్రజలకు అర్థమైందని, వంద రోజుల్లో హామీలు నెరవేర్చకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫిబ్రవరి 1న గ్రూప్ –1 నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారని, అది ఏదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రైతుబంధు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో జమ కావడం లేదని విమర్శించారు. మరో రెండు నెలలు గడిస్తే కాంగ్రెస్ నాయకులను ప్రజలే తరిమి కొడతారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ పాలన తీరు ప్రజలకు అర్థమైందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. వచ్చే ఎన్నికల వరకు తనను కనుమరుగు చేయాలని కుట్ర చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆవేదన వ్యక్తం చేశారు. తనను పదవి నుంచి తొలగించాలని చూశారని, గన్‌మెన్‌ను తొలగించి ఖతం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన ప్రమాదాల్లో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ నుంచి ప్రమాద బీమా కింద రూ.2లక్షల చొప్పున చెక్కులు అందజేశారు.

నంది రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు



ఎత్తిపోస్తున్న నీరు

ధర్మారం(ధర్మపురి): ఎల్లంపల్లి గోదావరి జలాలను ఒక పంపు ద్వారా నందిమేడారం రిజర్వాయర్‌లోకి శుక్రవారం ఎత్తిపోసే పనులు ప్రారంభించారు. నందిమేడారంలోని పంప్‌హౌస్‌లోకి నీటిని తరలించి రెండో విద్యుత్ మోటారు ద్వారా 3,150 క్యూసెక్కులను మేడారం రిజర్వాయర్‌లోకి డెలివరీ సిస్టర్న్ ద్వారా ఎత్తిపోస్తున్నారు. ఎల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా రెండు రోజులుగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి తరిస్తున్నారు. దీంతో నంది మేడారం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరి ఆయకట్టుకు ఇబ్బంది అవుతుందనే రైతుల విన్నపం మేరకు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అధికారులతో మాట్లాడి ఎల్లంపల్లి ప్రాజెక్టులోని గోదావరి జలాలను మేడారం రిజర్వాయర్‌లోకి తరలించేలా చర్యలు తీసుకున్నారు.

జాతర సొమ్ము నీటిపాలు



లోతట్టు ప్రాంతంలోని జాతర ప్రాంగణం

- తాత్కాలిక ఏర్పాట్లపై భక్తుల పెదవి విరుపు
- ప్రత్యేక నిధులు కేటాయించి శాశ్వత కట్టడాలు చేపట్టాలి
- గోదావరిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని వినతి
- లోతట్టు ప్రాంతంలో ఓసీపీ మట్టితో నింపాలి
- సమ్మక్క – సారలమ్మ భక్తుల డిమాండ్



పుష్కరఘాట్‌లో కొట్టుకుపోయిన మెట్లు

గోదావరిఖని: భక్తుల సొమ్ము వరదనీటి పాలవుతోంది. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన పనులు అక్కరకు రాకుండాపోతున్నాయి. రెండేళ్ల తర్వాత మళ్లీ వనదేవతల జాతర వచ్చేసరికే కొత్త బడ్జెట్, కొత్త నిర్మాణాలతో కాంట్రాక్టర్లు ధనవంతులవుతున్నారు. సింగరేణి యాజమాన్యం, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, మున్సిపల్ కార్పొరేషన్ నిధులను పెద్ద ఎత్తున కేటాయిస్తున్నా.. జాతర ముగిశాక పరిస్థితి మళ్లీ మొదటికే వస్తోంది. ప్రధానంగా కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో జాతర ప్రాంగణానికి ఏటా వరద ముంపు ముప్పు తలెత్తుతోంది. దిగువన నిర్మించిన సుందిళ్ల ప్రాజెక్టులోని బ్యాక్‌వాటర్ గోదావరి నది సమీపంలోని సమ్మక్క – సారలమ్మ గద్దెలతోపాటు జాతర ప్రాంతాన్ని ముంచెత్తుతోంది. దీంతో అభివృద్ధి పనులన్నీ నీటి పాలవుతున్నాయి.

రోడ్డు నిర్మాణంతో..

రెండేళ్ల క్రితం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమ్మక్క – సారలమ్మ అమ్మవార్ల గద్దెల ఎదుట ముందుచూపుతో నిర్మించిన సీసీ రోడ్డుతో జాతర ప్రాంగణం సుమారు మూడు మీటర్ల లోతట్టులోకి చేరింది. వర్షాకాలంలో వర్షపు నీరు, బాక్‌వాటర్ నిలవడంతో వనదేవతల గద్దెలు నీట మునిగిపోతున్నాయి. అందులో చేరిన వరదనీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. దీంతో రెండేళ్లకోసారి జాతర సమయంలో మరమ్మతు చేయించడం, ఏర్పాట్లు చేయడం నిర్వాహకులకు ఆర్థిక భారంగా మారుతోంది.

బ్యాక్ వాటర్‌తో మునిగిపోకుండా చూడాలి..

మరో పాతికేళ్లకు కూడా చెక్కు చెదరకుండా జాతర ప్రాంగణం తీర్చిదిద్దాలని సమ్మక్క – సారలమ్మ భక్తులు కోరుతున్నారు. ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా.. జాతర ముగిశాక ఆ ఏర్పాట్లు ఎక్కడా కనిపించడం లేదు. సింగరేణి కార్మికులు మేడారం జాతరకు వెళ్తే బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం 'ఖని' గోదావరి తీరంలో వన దేవతల జాతర ప్రారంభించింది. రాజీవ్ రహదారి పక్కన, గోదావరి తీరం సమీపంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే వంతెన ఉండటంతో ఇక్కడి జాతరకు ప్రత్యేకత నెలకొంది. పొరుగు జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

శాశ్వత పనులు చేపట్టాలి



జాతర ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి. నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేదిలేదు. లోతట్టు ప్రాంతాల్లో మట్టి నింపాలి. సింగరేణి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలి. జాతర సమీపంలో పర్మినెంట్ కార్యాలయాలు నిర్మించాలి.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

ఎత్తుగా నిర్మిస్తే ప్రయోజనం



జాతర ప్రాంగణంలోని లోతట్టు ప్రాంతాల్లో మట్టిపోసి ఏర్పాట్లు చేస్తే భవిష్యత్‌లో సమ్మక్క సారలమ్మ భక్తులకు ఎంతోఅనుకూలంగా ఉంటుంది. అలాగే వర్షాకాలంలో కూడా మునిగిపోకుండా పర్మినెంట్ కట్టడాలు కూడా ఎత్తులో నిర్మించాలి. రామగుండం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సింగరేణి, ఎన్టీపీసీ సహకారంతో పనులు కొనసాగుతున్నాయి.

– పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, జాతర కమిటీ అధ్యక్షుడు

60 రోజులు.. 140 లక్షల టన్నులు

- రోజూ 2.3 మిలియన్ టన్నుల రవాణా
- సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి లక్ష్యం
- సంస్థ సీ ఎండీ ఎన్.బలరాం



మాట్లాడుతున్న సీ ఎండీ ఎన్.బలరాం



హాజరైన జీఎంలు

గోదావరిఖని: వచ్చే 60 రోజుల్లో 140 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. శుక్రవారం అన్ని ఏరియాల జీఎంలతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. ప్రతీరోజు 2.3లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణా చేయాలని అన్నారు. దేశ ఇంధన అవసరాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు..

- ప్రణాళిక ప్రకారం ముందుకు సాగి సంస్థ లక్ష్యాల సాధనలో ముందుండాలని సీఎండీ బలరాం అన్నారు.
- రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.
- ఈ నేపథ్యంలో బొగ్గుతో నడిచే థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.
- సింగరేణితో ఒప్పందం చేసుకున్న అన్నిథర్మల్ కేంద్రాలకు తగినంత బొగ్గు రవాణా చేయాలని ఆయన స్పష్టం చేశారు.
- ఈఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడానికి రెండు నెలల గడువే మిగిలి ఉందని పేర్కొన్నారు.
- మొదటి 10 నెలల్లో 56.7 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా 56.3 మిలియన్ టన్నులు సాధించామని చెప్పారు.
- గతేడాది ఇదే సమయానికి సాధించిన ఉత్పత్తి లక్ష్యంపై ప్రస్తుతం 4 శాతం వృద్ధి నమోదు చేశామని ఆయన వెల్లడించారు.
- 56.7 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాను లక్ష్యంగా నిర్దేశించగా 57.23 మిలియన్ టన్నులు రవాణా చేశామని పేర్కొన్నారు.
- గతేడాదితో పోల్చితే 6శాతం వృద్ధి నమోదైందని ఆయన వివరించారు.
- భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జీఎంలను ఆదేశించారు.
- ఓవర్ బర్డెన్ తొలగింపు కాంట్రాక్టర్లు నిర్దేశిత సంఖ్యలో యంత్రాలను అందుబాటులో ఉంచేలా చూడాలని సీఎండీ ఆదేశించారు.
- వారి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

కొత్త ప్రాజెక్టులపై దిశానిర్దేశం

ఈఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఒడిశాలోని నైనీకోల్ బ్లాక్, కొత్తగూడెం ఏరియాలోని వీకేకోల్ మైన్స్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ గని ప్రారంభానికి అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎండీ పేర్కొన్నారు. 19.80 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులను వీలైనంత త్వరగా ప్రారంభించుకోవాలని పేర్కొన్నారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించే రామగుండం-3 ఆర్జీ కోల్ మైన్స్, బెల్లంపల్లి ఏరియాలోని ఎంవీకే ఓసీ అనుమతుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) జె.అల్విన్, జీఎం(కో–ఆర్డినేషన్) ఎం.సురేశ్, జీఎం(సీపీపీ) జక్కం రమేశ్, మార్కెటింగ్ జీఎం జి.దేవేందర్, జీఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖాతాలో డబ్బు మాయం


బాధితురాలు అనసూయ

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని స్వప్న కాలనీ చెందిన అనసూయ తన బ్యాంకు ఖాతాలోని రూ.లక్ష 70,000 నగదు మాయమైనట్లు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో తమ కూతురు విద్యాభ్యాసన కోసం నిల్వచేసిన డబ్బులను తనకు సమాచారం లేకుండానే ఎవరో కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి సంబంధం లేకుండా తన వేలిముద్ర తీసుకుని డబ్బులు మాయం చేశారని ఆరోపించారు. కాగా, బ్యాంకు లావాదేవీలపై జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు, బ్యాంక్ అధికారులు సూచించారు.

జీఎంను కలిసిన అధికారులు


మొక్క అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణను కలిశారు. ఈసందర్భంగా ఆయనకు మొక్కను అందజేశారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా వ్యవహరించాలని జీఎంను కోరారు. జీఎంను కలిసిన వారిలో నాయకులు పి.నర్సింహులు, పానుగోటి శ్రీనివాస్, కిరణ్‌రాజ్, రాంరెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): ఖిలావనపర్తి గ్రామానికి చెందిన భూతగడ్డల వసంత (29) అనే వివాహిత కడుపునొప్పి బాధ భరించలేక గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆమె కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించుకుని మందులు వాడినా నయం కాలేదు. ఈక్రమంలో కడుపునొప్పి అధికం కావడంతో ఆ బాధ భరించలేక ఇంట్లోనే ఎవరూ లేనిసమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడు నూనె మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. మృతురాలికి వైశాలి(10), వనజ (6) కూతుళ్లు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో జేఎన్టీయూ విద్యార్థి మృతి


రవితేజ (ఫైల్)

కొండగట్టు(చొప్పదండి): నాచుపెల్లి జేఎన్టీయూ ఈఈఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి రవితేజ గురువారం వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు రాసిన రవితేజ వారం రోజుల క్రితం వరంగల్ వెళ్లాడు. అక్కడ మృతి చెందడంతో కళాశాలలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కార్మికుల చేతిలో సంస్థ ప్రగతి

- పనితీరు మెరుగుపర్చడం లక్ష్యం
- గనులపై మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటన
- 5న ప్రక్రియ ప్రారంభం



గోదావరిఖని: చేసేదెంత? చేసిందెంత? చేయబోయేదెంత? అనేదానిపై లెక్కలు కార్మికుల ముందుంచేందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధమైంది. ఉత్పత్తి లక్ష్యాలు మెరుగుపర్చడం., గనుల వారీగా, కార్మికులు చేయాల్సిన పనితీరు గురించి వివరించడంపై దృష్టి సారించింది. నాలుగేళ్ల కితం నిలిపివేసిన కమిటీల పర్యటనకు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే పలు గనుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాం.. ఇప్పుడు కార్మికుల నుంచి మరింత సహకారం తీసుకోవడంపై దృష్టి సారించారు. ఈక్రమంలో మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీల పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రైవేట్‌ఓబీల్లో పనితీరు, డిపార్ట్‌మెంట్ ఓబీల్లో పనివిధానంపై యాజమాన్యం ఇప్పటికే బేరీజు వేస్తోంది. రోజులో 22గంటలకు పైగా ప్రైవేట్ ఓబీలో పనిచేస్తుండగా, సింగరేణి యంత్రాలు రోజులో 18గంటలకు మించి పనిచేయడం లేదని పేర్కొంటున్నారు. పనిగంటలు పెంచుకోవడంతోపాటు రక్షణతో కూడిన ఉత్పతి తీయడంపై యాజమాన్యం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది.

సీ అండ్ ఎండీ ఆదేశాలతో..

- సంస్థ సీ అండ్ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.బలరాం.. బొగ్గు గనుల్లో ఉత్పత్తి లక్ష్యాల పెంపుపై దృష్టి సారించారు.
- ప్రధానంగా రూ.వేల కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకోవడం లేదనే అసంతృప్తిలో ఉన్నారు.
- ఈవిషయంలో కార్మికులను చైతన్య పర్చడమే లక్ష్యంగా మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీలను పునరుద్ధరించారు.
- నాలుగేళ్ల క్రితం కనుమరుగైన ఈకమిటీలకు మళ్లీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఏరియా వారీగా పర్యటించేందుకు సిద్ధమయ్యారు.
- ఈనెల 5నుంచి గనులపై పర్యటించనున్నారు.
- ఇప్పటికే ఆయా ఏరియాల అధికారులు షెడ్యూలు సిద్ధం చేశారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీల పర్యటన

సంస్థ వ్యాప్తంగా ఉన్న 12 ఏరియాల్లో స్థానికంగా ఏర్పాటు చేసిన కమిటీలు గనులపై పర్యటించనున్నాయి. సేఫ్టీ అధికారి, ఈఅండ్‌ఎం, ఫైనాన్స్, పర్సనల్, ఐఈడీ అధికారులు గనులపై పర్యటించి వాస్తవాలు వివరించనున్నారు. ప్రధానంగా ఓఎంఎస్(అవుట్ పుట్ ఫర్ మ్యాన్) ఒక కార్మికుడు ఎంత బొగ్గు ఉత్పత్తి తీయాలి, ఎంత పని చేస్తున్నారనే స్థాయి నుంచి డిపార్ట్‌మెంట్, గని, ఏరియా ఎంత లాభాలు, ఎంతనష్టాల్లో ఉందో ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా కమిటీ సభ్యులు వివరించనున్నారు. ఈ మేరకు సింగరేణి ఉన్నతాధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు.

బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

- సంస్థ సీ ఎండీ బలరాం


మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: కంటిన్యూయస్ మైనర్ యంత్రాల ద్వారా పూర్తిస్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాం సూచించారు. శుక్రవారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన ప్రణాళికలు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాల పనితీరు, బొగ్గు కటింగ్ సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు తదితర విషయాలపై చర్చించారు. భూగర్భ గనులల్లో కంటిన్యూయస్ మైనర్ ద్వారా బొగ్గు ఉత్పత్తి కీలకమని తెలిపారు. ఆ యంత్రాలను సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డితోపాటు అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు. ఆర్జీ–1 ఏరియాలో జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ జీడీకే–11గనిలో కంటిన్యూయస్ మైనర్ల ద్వారా బొగ్గు కటింగ్ పరిశీలిస్తున్నామన్నారు. రక్షణ విషయంలో రాజీలేకుండా ముందుకు సాగుతున్నామని వివరించారు. ఆయన వెంట అధికారులు చిలక శ్రీనివాస్, జాయి మైనింగ్ సర్వీసెస్ ప్రాజెక్ట్ అధికారి శుక్లా, జెన్‌కో ప్రాజెక్ట్ అధికారి రాకేశ్ ఉన్నారు.

హుస్సేన్‌మియా వాగుకు చేరిన ఎస్సారెస్పీ నీళ్లు


సంబరాలు చేసుకుంటున్న రైతులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ కృషితో శ్రీరాంసాగర్ నీళ్లు హుస్సేన్‌మియావాగులో చేరాయి. దీంతో చివరి ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హుస్సేన్ మియా వాగులో పూలుచల్లి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కాలువల్లో పూడికతీత తీయక శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో పూడికతీసి మరమ్మతు చేసిచివరి ఆయకట్టుకు సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నాయకులు గాజనవేన సదయ్య, సబ్బని రాజమల్లు, మునీర్, సతీశ్, దేవేందర్ ఉన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: ఏపీలోని విజయవాడలో జరిగిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో పెద్దపల్లి మండలం రాగినేడు జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. పోర్టబుల్ వీల్‌చైర్ ర్యాంపు అనే అంశంపై ఇచ్చిన ప్రదర్శనకు బహుమతి దక్కిందని పేర్కొన్నారు. అలాగే సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సురేందర్ ఇన్నోవేషన్ ఇన్‌సైన్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి దక్కిందన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, క్యూరేటర్ జ్యోతి మెహ్రా చేతుల మీదుగా బహుమతులి అందుకున్నట్లు తెలిపారు. బహుమతి అందుకున్న విద్యార్థులు కీర్తన, సాత్వికను జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు ఆగయ్య, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఎంపీ టికెట్ ఇవ్వండి




దరఖాస్తు చేస్తున్న వరప్రసాద్, గజ్జెల కాంతం, పెర్క శ్యాం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్(ఎస్సీ) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ కేటాయించాలని పలువురు ఆశావహులు గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ ట్రైనింగ్ మెంబర్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ సైతం తమకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు సమర్పించారు.

రేపు సబ్ జూనియర్ అథ్లెటిక్ జిల్లా జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. అండర్– 8, 10, 12, 14 విభాగాల్లోని బాలబాలికలకు రన్నింగ్, జంపింగ్, త్రో అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు క్రీడాపాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

జేసీబీకి ఢీకొని వ్యక్తి దుర్మరణం


భూంరెడ్డి (ఫైల్)

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి గ్రామంలో రోడ్డుపై నిలిపి ఉన్న జేసీబీని బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొని మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం దుంద్రపల్లి గ్రామానికి చెందిన కందుల భూంరెడ్డి (60) తన ద్విచక్ర వాహనంపై వట్టెంల నుంచి వేములవాడకు వస్తున్నాడు. శాత్రాజుపల్లి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న జేసీబీని వెనక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఉద్యోగంపై బెంగతో ఆత్మహత్య


సాగర్‌రెడ్డి (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉద్యోగంపై బెంగతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన గూడ సాగర్‌రెడ్డి(18) శుక్రవారం గ్రామ శివారులోని పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అతడి తల్లిదండ్రులు గూడ సంజీవ్‌రెడ్డి, రేణుకకు సమాచారం అందించారు. వారు వచ్చేసరికి సాగర్‌రెడ్డి విగతజీవిగా మారాడు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సాగర్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వెళ్లి కంప్యూటర్ కోర్సులో చేరాడు. తిరిగి ఢిల్లీకి వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తుందో రాదోననే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్‌క్రైం: స్థానిక కశ్మీర్‌గడ్డకు చెందిన ఖాసీం (55)పై జనవరి 30న ప్రమాదవశాత్తు శానిటైజర్ మీదపడగా, అప్పుడే బీడీ అంటించుకునే క్రమంలో నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

‘ఉపాధి పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర’

కరీంనగర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు మరణశాసనం విధించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ప్రకటనలో ఆరోపించారు. ఉపాధి పథకానికి ఏటా బడ్జెట్‌లో కోత విధించినట్టుగానే ఈసారి కూడా కేటాయింపులు తక్కువ చేశారని అన్నారు. గతేడాది కంటే తక్కువ కేటాయించి, ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు చేశామని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల ఈ ఏడాది 1/3 వంతు ఉపాధి కూలీలు పనికి దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని, ఉపాధి పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనా లు పెంచాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ, విద్య, వైద్యం, ఉపాధి తదితర పథకాలకు బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ పక్షపాతినని నరేంద్రమోదీ మరోసారి రుజువు చేసుకున్నారని విమర్శించారు.

బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం



కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల సుమంగళి క్లాత్‌స్టోర్‌లో శుక్రవారం వేకువజామున అగ్ని ప్రమాదం జరిగింది. వేకువజామున 5 గంటలకు యజమాని సంతోష్‌గౌడ్ దుకాణంలో మంటలను గమనించాడు. వెంటనే షట్టర్ ఓపెన్ చేసి చుట్టుపక్కలవారి సాయంతో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల విలువైన బట్టలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

నలుగురిపై వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్‌లో నివాసం ఉంటున్న బత్తుల జ్యోతి ఉరఫ్ వంగల జ్యోతిని అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఘటనలో నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడుకు చెందిన జ్యోతి కుటుంబ సభ్యులు రాచర్లబొప్పాపూర్‌లో నివాసం ఉంటున్నారు. జ్యోతిని పెర్కవేడుకు చెందిన వంగల సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. మూడునెలల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత సుమన్‌తో పాటు మామ స్వామి, అత్త సుగుణ, బావ సునీల్ కలిసి రూ.10 లక్షల కట్నం తేవాలని జ్యోతిని శారీరకంగా, మానసికంగా వేధించడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ యజమానుల ఆందోళన


స్థానిక యజమానుల ఆందోళనతో నిలిచిపోయిన ట్రాక్టర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చేగుర్తిలో శుక్రవారం కరీంనగర్ ట్రాక్టర్లను స్థానిక ట్రాక్టర్ యజమానులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. మన ఇసుక–మన వాహనంలో చేగుర్తి, దుర్శేడ్‌కు చెందిన ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. చేగుర్తి ఇసుక క్వారీలో రెండు గ్రామాలకు చెందిన సుమారు 60 ట్రాక్టర్లకు మైనింగ్ అధికారులు అవకాశం కల్పించారు. అయితే కొత్తగా కరీంనగర్‌కు చెందిన 18 ట్రాక్టర్లకు అవకాశమివ్వగా శుక్రవారం చేగుర్తి క్వారీకి రావడంతో స్థానిక ట్రాక్టర్ యజమానులు అడ్డుకున్నారు. కరీంనగర్ ట్రాక్టర్లు క్వారీలోకి పోకుండా ఆందోళన చేయడంతో స్థానిక నాయకుడు ఒకరు క్వారీ గేటుకు తాళం వేయడంతో వివాదమేర్పడింది. రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డుకున్న చేగుర్తికి చెందిన యజమానులను స్టేషన్‌కు తరలించారు. అయితే క్వారీ వివాదం తమకు ఎందుకన్నట్లుగా పోలీసులు ట్రాక్టర్ యజమానులను మైనింగ్ కార్యాలయానికి పంపించారు. ఈసందర్భంగా కరీంనగర్ ట్రాక్టర్లను తొలగించి స్థానిక ట్రాక్టర్లకు మాత్రమే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ మైనింగ్ అధికారులకు యజమానులు వినతిపత్రం సమర్పించారు.

టీఎన్జీవో నాయకుడు సుధీర్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌అర్బన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన టీఎన్జీవో నాయకుడు నూగూరి సుధీర్‌పటేల్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద సుధీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సుధీర్ నివాళి అర్పించారు. పెద్దపల్లిలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, టీఎన్జీవోల సంఘంలో వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. టీఎన్జీవోల సంఘం కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీని వాస్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ ఇ రుమల శారద, సబిత, టీజీవో నాయకులు మడిపల్లి కాళిచరణ్‌గౌడ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, కార్యదర్శి సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు బిక్షపతి, కొండయ్య, భూమయ్య, సేవియానాయక్, మల్కా రాజేశ్వరరావు, ఆరవెల్లి రాజేశ్వరరావు, సబిత, హరిప్రియ, శైలజ, పద్మ, కామ సతీశ్, లవకుమార్, పవన్‌కుమార్, సత్యనారాయణ, బైరి శ్రీనివాస్, అంజాద్, మన్మీత్‌సింగ్, ప్రణీత్‌కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు తదితరులు ఉన్నారు.


భోజన్నపేటలో నిరుపయోగంగా మారిన దంపింగ్ యార్డు


నారాయణరావుపల్లిలో..


రాములపల్లిలో పిచ్చిమొక్కలు పెరిగిన సామూహిక మరుగుదొడ్లు

అలంకారప్రాయం

పరిసరాల పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి దంపింగ్ యార్డులు, సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఈక్రమంలో స్వచ్ఛతో జిల్లా అనే అవార్డులు సొంతం చేసుకుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇప్పుడు పర్యవేక్షణ లోపించింది. నిర్మించాక వాటిగురించి పట్టించుకోకపోవడం, అవగాహన రాహిత్యంతో చెత్త డింపింగ్ యార్డులు, సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. చెత్తను వేరుచేసి తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు తయారీ కేంద్రాలుగా, ప్లాస్టిక్‌ను వేరుచేసి రీసైక్లింగ్ ఉత్పాదక సెంటర్లుగా మార్చాలనే పాలకుల ఆశలకు తూట్లు పడుతున్నాయి. జిల్లాలోని సుగ్లాంపల్లి, రాములపల్లి, చిన్నకల్వల, ధూళికట్ట, నిట్టూరు, భోజన్నపేట తదితర గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు, చెత్త డంపింగ్ యార్డులు అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి